క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



విద్యానగర్ కాలనీలో శుభ్రం చేయిస్తున్న కాలనీ వాసులు

పరిగి: తప్పనిసరిగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులు పేర్కొన్నారు. పట్టణ కేంద్రంలోని విద్యానగర్ కాలనీలో మురుగు కాల్వల నిర్మాణం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. కాలనీల్లో వెలువడుతున్న మురుగు పారడానికి దారి లేక అవస్థలు పడుతున్నట్లు వాపోయారు. ఇండ్లనుంచి వెలువడిన మురుగును శుభ్రం చేయించాలని మున్సిపల్ అధికారులకు ఎంత చెప్పినా పట్టించుకోవడంలేదు. దీంతో కాలనీలోని ప్రజలు అందరు కలిసి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మురుగు కాల్వలు, రోడ్డు మరమ్మతు పనులను చేపట్టారు.

ఘనంగా గ్యార్మీషరీఫ్ పండుగ



ప్రార్థన చేస్తున్న హజ్రత్ సయ్యద్ జహూర్దీన్ షా ఖాద్రి, సయ్యద్ ఖలీల్

ఆమనగల్లు: పట్టణంలో ఆదివారం ముస్లింలు గ్యార్మీషరీఫ్ పండుగ ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకలలో భాగంగా మౌలాలి పహడ్ దర్గా సమీపంలోని గౌసేపాక్ చిల్లా వద్ద నిర్వహించిన ప్రార్థనలో ముస్లిం మత గురువు హజ్రత్ సయ్యద్ జహూర్దీన్ షా ఖాద్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పట్టణంలో మైనార్టీలు గ్యార్మీషరీఫ్ జెండాతో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా గౌసేపాక్ చిల్లా వద్ద ప్రత్యేక ప్రార్థనలు, దువా నిర్వహించారు. అనంతరం సయ్యద్ ఖలీల్ అన్నదానం నిర్వహించారు.

రిజర్వేషన్లు అమలయ్యే వరకు పోరాటం



దీక్షలో కూర్చున్న రిజర్వేషన్ల సాధన సమితి సభ్యులు

షాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేదాకా పోరాటాలు చేస్తామని బీసీ రిజర్వేషన్ల సతిమి సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద 42 శాతం బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. సాయంత్రం మండల కురుమ సంఘం అధ్యక్షుడు మద్దూరు పాండు వారికి నిమ్మరసం ఇచ్చి నిరాహార దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీలకు రిజర్వేషన్ల విషయంలో తీరని అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. పార్టీలకతీతంగా బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి రిజర్వేషన్ల సాధనకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేంతవరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు జడల రాజేందర్‌గౌడ్, వెంకట్‌యాదవ్, తమ్మలి రవీందర్, రమేశ్‌యాదవ్, చేవెళ్ల స్వామి, గడ్డం చంద్రయ్య, రాపోల్ నర్సింలు, మద్దూరు పాండు, ఒగ్గు రాజు, రాము శ్రీశైలం, శేఖర్, సుదర్శన్, హరికృష్ణ, సత్యం, చందిప్ప జంగయ్య, గోపాల్, సత్యనారాయణ, మల్లయ్య, బీరయ్య, ఆంజనేయులు, హరికుమార్, విఠలయ్య, హనుమంతు ఉన్నారు.

కూచిపూడి నృత్యంలో ప్రతిభ



మెమొంటో, ప్రశంసాపత్రాలు అందుకున్న చిన్నారి అక్షయ

షాద్‌నగర్‌రూరల్: దేవీశరన్న వరాత్రులను పురస్కరించుకొని మహతి ఆర్ట్స్ థియేటర్ ఆధ్వర్యంలో నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఆదివారం కూచిపూడి నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఈ నృత్య ప్రదర్శనలో పట్టణానికి చెందిన ప్రభోదయ డ్యాన్స్ అండ్ మ్యూజిక్ గురువు రంజుప్రవీణ దగ్గర శిక్షణ తీసుకుంటున్న అక్షయ 'చేరి యశోదకు శిశువితడు' గానంపై ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. అదేవిధంగా చిన్నారులు సిద్ధివినాయక, పుష్పాంజలి, రామ రామ, ముద్దుగారె యశోద పాటలపై హితిక, మోక్ష, ఉషశ్రీ, ధ్రువిక, నిఖిత చేసిన కూచిపూడి నృత్యాలు అభిమానులను అలరించాయి. చిన్నవయసు నుంచే నృత్యకళపై ఆసక్తిని కనబరుస్తూ రాణిస్తున్న చిన్నారులకు ప్రముఖ నాట్యగురువు సజని వల్లభనేని మెమొంటోలు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

పాడైన రోడ్లతో ప్రమాదాలు!

- మరమ్మతులపై నిర్లక్ష్యం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



ఖాంజాపూర్ గేట్ సమీపంలో ప్రమాదానికి గురైన ఆటో



తాండూరు టౌన్: గాయాలపాలైన మహిళలు

తాండూరు టౌన్: పాడైన రోడ్లతో పెను ప్రమాదాలు సంభవిస్తున్నాయి. తాండూరు నుంచి వికారాబాద్ మార్గంలో రహదారి అధ్వానంగా తయారైంది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా తమ వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కిలోమీటర్ల మేర గుంతలుగా ఉండటంతో వికారాబాద్ వెళ్లాలంటేనే వాహనదారులు వణుకుతున్నారు. రోడ్లపై ఏర్పడిన గుంతల్లో నామమాత్రంగా కంకర వేసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. కంకర తేలిన దారులపై ప్రయాణించాలంటే ప్రమాదాలకు గురవుతున్నట్లు చెబుతున్నారు. తాజాగా హైదరాబాద్ రోడ్డు మార్గంలోని ఖాంజాపూర్ గేటు వద్ద శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఓ పసిపాపకు అనారోగ్యంగా ఉండటంతో కందనెల్లి వైపు నుంచి తాండూరులోని ఆస్పత్రికి ఆటోలో తీసుకువస్తున్నారు. ఖాంజాపూర్ గేట్ సమీపంలో చేరుకోగానే ఆటో అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు మహిళలతో పాటు మరో ఇద్దరు గాయాలపాలయ్యారు. అదృష్టవశాత్తు పెద్ద ప్రమాదం తప్పింది. రోడ్లు సరిగ్గా లేకపోవడం వల్లే ప్రమాదం సంభవించిందని బాధితులు, వాహనదారుడు పేర్కొన్నారు. ఆరు నెలల క్రితం వికారాబాద్ నుంచి తాండూరు వరకు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నట్లు హడావిడి చేసిన అధికార పార్టీ నాయకులు ఆ తర్వాత ఆ విషయాన్ని మరిచి పోయారు. వెంటనే ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి స్పందించి గుంతలుగా మారిన తాండూరు– వికారాబాద్ రోడ్డుకు మరమ్మతు పనులు చేయించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆ దారులు గుంతలమయం!

అనంతగిరి: వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని పలు రోడ్లు గుంతలమయంగా మారాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పలు చోట్ల పాడయ్యాయి. దీంతో ప్రజల రాకపోకలకు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు వాహనదారులు కిందపడ్డ దాఖలాలు ఉన్నాయి. వర్షం కురిస్తే చాలు గుంతల్లో వర్షపు నీరు చేరడంతో రోడ్డు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నట్లు వాపోతున్నారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. నిత్యం ఈ మార్గాల్లోనే ప్రయాణించి ఇబ్బందులకు గురవుతున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మరమ్మతులు చేయించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.



అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయం ఎదుట రోడుపై ఏర్పడిన గుంత

పైప్ లైన్ లీకేజీ..

పట్టించుకోని అధికారులు

ధారూరు: కుక్కింద రోడ్డులో రైస్ మిల్లు సమీపంలోని మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోయి భగీరథ నీరు లీకేజీ అవుతోంది. ఆదివారం పైపులైన్ పగిలి తాగునీరు వృథాగా పోతుంది. మిషన్ భగీరథ పైపులైన్ నిర్మాణం నాణ్యత లేకపోవటం వల్లే తరచూ పైపులైన్లు పగిలి తాగునీటి సరఫరాకు అంతరాయ ఏర్పడుతుందని స్థానికులు వివరిస్తున్నారు. తక్షణమే పగిలిన మిషన్ భగీరథ పైపులైన్‌ను మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



వృథాగా పోతున్న తాగునీరు



ప్రభుత్వ పాఠశాల పక్కన బోరు నుంచి..



ఎస్సీ కమ్యూనిటీ హాల్ సమీపంలో వృథాగా పోతున్న నీరు

నీటి వృథా.. ఆపేదెవరు?

మండల పరిధిలోని కుదురుమల్ల గ్రామంలో తాగునీటి బోరునుంచి నీరు వృథాగా పోతుంది. నీటి వృథాను అరికట్టాల్సిన అధికారులు తమకేమిపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.

పెద్ద ఉమ్మెంతాల్‌లో వాలీబాల్ టోర్నమెంట్

పూడూరు: మండల పరిధిలోని పెద్ద ఉమ్మెంతాల్ గ్రామంలో తిరుమల నాథస్వామి ఉత్సవాల సందర్భంగా సోమవారం వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బి. సుభాష్ తెలిపారు. బేగరి తిరుమలయ్య స్మారకార్థం ఈ పోటీలను నిర్వహిస్తున్నామని ప్రథమ బహుమతి రూ.50వేలు, ద్వితీయ రూ.25వేలు ఉంటుందని తెలిపారు. పోటీల్లో పాల్గొనే జట్లు తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9398994209, 7032799544 నంబర్‌లలో సంప్రదించాలని కోరారు.

దేవాలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న గ్రామస్తులు

షాద్‌నగర్: వెలిజర్లలో పోచమ్మ దేవాలయ నిర్మాణానికి గ్రామస్తులు ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. దేవాలయాల నిర్మాణంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జాంగారి నర్సింహ, రవీందర్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చేవెళ్ల: గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యే కాలె యాదయ్య ఎంతో కృషి చేస్తున్నారని ఆలూరు మాజీ సర్పంచ్ అనంతరాములు, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు గోపులారం యాదమ్మ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ యాదిరెడ్డి అన్నారు. మండలంలోని ఆలూరులో హెచ్ఎండీఏ నిధులు రూ.10 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను ఆదివారం స్థానిక నాయకులు, గ్రామస్తులతో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉన్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు ఎమ్మెల్యే ప్రత్యేక నిధులు తీసుకొస్తున్నారన్నారు. ఎమ్మెల్యే సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పెస్కారి రాజు, తలారి రాజు, అశోక్, సునీల్‌కుమార్, సుదర్శన్, శంకరయ్య, నర్సింలు, ఆనందం, రుక్కయ్య, జంగయ్య, బాల్‌రాజ్, శ్రీనివాస్, ప్రశాంత్ వెంకటేశ్, బుచ్చయ్య, రాజు, మహేందర్ తదితరులు ఉన్నారు.



పనులను ప్రారంభిస్తున్న నాయకులు

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

భక్తిశ్రద్ధలతో శివ పార్వతుల కల్యాణం

దుద్యాల్: మండల పరిధిలో హకీంపేట్ గ్రామంలోని మల్లికార్జున స్వామి దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. రెండు రోజులుగా నిర్వహిస్తున్న వార్షికోత్సవ వేడుకల్లో ఆదివారం దేవాలయం ఎదుట భారీ ధ్వజ స్తంభం, నవగ్రహాలు, వీరభద్రేశ్వర స్వామి, రేణుక చార్య దేవ్వళ్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ పూజలను తిలకించడానికి గ్రామస్తులు భారీగా తరలివచ్చారు. అనంతరం ఆలయ ఆవరణలో నిర్వహించిన శివ పార్వతుల కల్యాణం ఘనంగా చేశారు. సాయంత్రం స్వామి వారికి మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామానికి చెందిన గజ్జెల నర్సింహా రెడ్డి కుటుంబ సభ్యులు ప్రత్యేక చొరవ తీసుకుని ఈ వేడుకలను నిర్వహించారు.



బోనాలతో మహిళలు



ధ్వజ స్తంభం ఏర్పాటు చేయిస్తున్న గ్రామస్తులు

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న గోపి

రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి

పరిగి: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణ కేంద్రంలో రజక సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని రజకులు చాలా నిరుపేద కుటుంబంలో ఉన్నారన్నారు. ఇప్పటికి చాలా గ్రామాల్లో రజకులు కుల వృత్తినే నమ్ముకుని జీవిస్తున్నారని తెలిపారు. ఎస్సీలో చేర్చడం ద్వారా రజకులు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఎదుగుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తానన్నారు. రజకులు సమష్టిగా కలిసి ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేసే ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రవీందర్, యాదయ్య, బస్వరాజ్, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాలు అదుపు

కాంగ్రెస్ నాయకుడు పెంటయ్య

దుద్యాల్: సీసీ కెమెరాలతో నేరాలు అదుపు చేయొచ్చని దాత, కాంగ్రెస్ నాయకుడు పెంటయ్య పేర్కొన్నారు. ఆదివారం గ్రామంలోని ప్రధాన రహదారిలో రెండు సీసీ కెమెరాలు స్వంత ఖర్చులతో ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామంలో సీసీ కెమెరాలు ఉండడం వల్ల చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. దోపిడీ, దాడులు జరిగినప్పుడు నేరస్తులను పట్టుకోవడానికి ఇవి దోహద పడుతాయన్నారు. గ్రామంలో ఎవరైన అనుమానాస్పద వ్యక్తులు ప్రవేశించినప్పుడు వారిని గుర్తించొచ్చు. ఈ సందర్భంగా ఎస్ఐ యాదగిరి ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ రవితేజ, కృష్ణ, గ్రామస్తులు నర్సిములు, రాములు, సాయప్ప, అంజిలయ్య తదితరులు పాల్గొన్నారు.

మోమిన్‌పేటలో..

మోమిన్‌పేట: ప్రతి ఇంటికీ సీసీ కెమెరా ఏర్పాటు చేసుకోవాలని సీఐ వెంకట్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ చిన్న, పెద్ద వ్యాపార సంస్థలు, బ్యాంకులు, పెట్రోల్ బంకులు, దుకాణాలు, విద్యాసంస్థలు, ఇళ్లు, వ్యాపార ప్రదేశాలు, వీధులు, కాలనీల్లో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఏదైన అనుకోని సంఘటనలు, దాడులు, దోపిడీలు సంభవించినప్పుడు నేరస్తులను సులభంగా గుర్తించొచ్చన్నారు.



దుద్యాల్: పోలేపల్లి ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



వెంకట్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న నాయకులు, కార్యకర్తలు

బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: ఎన్నికల ముందు ప్రజలకు సాధ్యం కాని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు, సర్ధార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ దారెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కేతిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పలువురు దాదాపు 150 మంది బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేతిరెడ్డిపల్లి సమీపంలోని పావనీ రిసార్ట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమాంలో కార్యక్రమానికి ఆయన పాల్గొని నాయకులు, కార్యకర్తలకు బీఆర్ఎస్ కండువాలు కప్పి స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాలు గడుస్తున్నా గ్రామల్లో ఒక్క అభివృద్ధి పని చేయలేదని విమర్శించారు. స్థానిక ఎన్నికలు లేక గ్రామాల అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చిత్తశుద్ధి ఉంటే గ్రామాల్లో ఎన్నికలు నిర్వహించేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారిలో సురేష్, భాస్కర్, శ్రీనివాస్, కుమార్, మహేందర్, సుమన్, వినోద్, కిరణ్, మైపాల్, లోకేష్, చరణ్, హరి, వెంకట్, శ్రీకాంత్, బాలాజీ, ఇస్మాయిల్, శివ, భరత్, మహేశ్ తదితరులు ఉన్నారు.

సమాజ మార్పులో ఉపాధ్యాయులు కీలకం

- మండల విద్యాధికారి సాయిరెడ్డి
- జాతీయ స్థాయి శిక్షణలో పూడూరు ఉపాధ్యాయులు

పూడూరు: సమాజ మార్పులో ఉపాధ్యాయులు కీలకమని మండల విద్యాధికారి సాయిరెడ్డి పేర్కొన్నారు. ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి విద్యాశిక్షణలో కొత్తపల్లి ఉపాధ్యాయుడు నాగరాజు అయిదు రోజుల శిక్షణలో పాల్గొన్నారన్నారు. దేశరాజధానిలో 'పాఠశాల విద్యాబోధనలో మ్యూజియం పాత్ర' అనే అంశంపై ఇచ్చిన శిక్షణలో ప్రతిభ కనబర్చారన్నారు. వికారాబాద్ జిల్లా నుంచి ఉపాధ్యాయులు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. శిక్షణా అనంతరం ఉపాధ్యాయులకు సర్టిఫికెట్‌లు అందజేశారని వివరించారు.

రోడ్డు ఇలా.. రాకపోకలు ఎలా?

- కల్వర్టు కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారిన దారి
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



కొకుంట్ల సమీపంలో కల్వర్టు కొట్టుకుపోయి బయటకు తేలిన పైపులు

చేవెళ్ల: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా మండలంలోని గ్రామాల రోడ్లు అధ్వానంగా మారాయి. దీంతో ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు నరకయాతన పడుతున్నారు. ఏళ్లుగా రోడ్లకు మరమ్మతులు లేకపోవడంతో గుంతలు ఏర్పడి, కంకర తేలడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

పట్టించుకునే వారు కరువు

మండలంలోని కొకుంట్ల నుంచి తంగడపల్లి రోడ్డుపై ఉన్న కల్వర్టు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మధ్య వరకు కోసుకుపోయింది. కల్వర్టు కింద ఉన్న పైపులు మొత్తం బయటపడి ప్రమాదకరంగా మారింది. దీనిని పట్టించుకునే వారు లేక ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్ అండ్‌బీ పరిధిలో ఉన్న ఈ రోడ్డుకు నిధులు కూడా మంజూరయ్యాయి కానీ పనులు జరగటం లేదు. ప్రస్తుతం ఈ కల్వర్టు వద్ద ఒకే వాహనం వెళ్లే పరిస్థితే ఉంది. ఇది కూడా వాహనాల రాకపోకలకు ఎప్పుడు కూలుతుందోనని భయపడిపోతున్నారు. ఈ కల్వర్టు వద్ద ఆదమరిచి వెళ్తే ప్రమాదం తప్పదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. వారంరోజులు అవుతున్నా ఈ రోడ్డును పట్టించుకునే నాథుడే కరువయ్యారని, ఎవరికి ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించాలని కోరుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులకు గ్రామ నాయకులు సమాచారం అందించిన కూడా ఇప్పటివరకు ఎవరూ స్పందించలేదని వాపోతున్నారు. నిత్యం ఈరోడ్డుపై కొకుంట్ల, అంతారం గ్రామస్తులు, రైతులతో పాటు వికారాబాద్, శంకర్‌పల్లి మండలాలకు వెళ్లే ప్రయాణికులు సైతం ప్రయాణం సాగిస్తుంటారు.

ప్రమాదకరంగా మారింది



వర్షాలకు కొకుంట్ల నుంచి తంగడపల్లి వెళ్లే రోడ్డుపై కల్వర్టు మొత్తం కొట్టుకుపోయి రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఈరోడ్డుపై ప్రయాణం చేసేందుకు ప్రజలు భయపడుతున్నారు. మిగిలిన రోడ్డు కూడా వర్షాలకు ఎప్పుడు పూర్తిగా కులుతుందో తెలియని పరిస్థితి. వెంటనే అధికారులు, నాయకులు స్పందించి రోడ్డును బాగు చేయాలి.

–ఇనాయిత్, మాజీ ఉపసర్పంచ్, కొకుంట్ల

మరమ్మతులు చేయిస్తాం

కొకుంట్ల రోడ్డుపై కల్వర్టు కోట్టుకుపోయిన విషయం మా దృష్టికి వచ్చింది. వెంటనే మరమ్మతులు చేయాలని కాంట్రాక్టర్‌కు చెప్పాం. ఈ రోడ్డుకు నిధులు మంజూరయ్యాయి. పనులు కూడా త్వరలో జరుగుతాయి. ఈ కల్వర్టు పనులు మాత్రం వెంటనే చేయాలని ఆదేశించాం.

– అజయ్‌కుమార్, ఆర్అండ్‌బీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్